క్లుప్తంగా

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాదరాజు

నరసాపురం రూరల్: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కొత్తోట గ్రామంలో నిర్వహించిన మహిళాసమైఖ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న భరోసాతో మహిళలు ఆర్థికంగా మరింత బలపడాలని ఆకాంక్షించారు. క్రమం తప్పకుండా ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ, అమ్మ ఒడి, ఆసరా తదితర సంక్షేమ పథకాల గురించి సమావేశాల్లో చర్చించుకోవాలని ప్రసాదరాజు అన్నారు. మహిళలకు ఏదైనా సమస్యలు ఏర్పడితే సచివాలయంలో ఉన్న మహిళా పోలీస్‌ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

వైభవంగా గణపతి నిమజ్జనోత్సవం



చెరుకువాడ రామాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: చెరుకువాడ రామాలయంలో గణపతి నిమజ్జనోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవం ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఉత్సవ కమిటీ, చెరుకువాడ కాపు నాయకుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును ఘనంగా సత్కరించారు. తీన్‌మార్ వాయిద్యాలు, బ్యాండు మేళాలు, డీజేలతో గ్రామోత్సవం హోరెత్తించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), పంచాయతీ సభ్యుడు చిట్నీడి రాము, మాజీ సర్పంచ్ మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, పోడూరి రామయ్య, సుంకర కుభేరుడు, బళ్ల మాధవ్, బళ్ల చిన్న, పలివెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు చింతపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రు గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్షా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య సిబ్బంది సర్వే చేసి గుర్తించిన ప్రతీ ఒక్కరూ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య నిపుణులతో పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వివరించారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జేసీఐ పాలకొల్లు రైసింగ్ క్లబ్ అధ్యక్షురాలు డా.కావలి మౌని

పాలకొల్లు అర్బన్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని జీవీఎస్‌వీ ఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. జేసీఐ పాలకొల్లు రైసింగ్ క్లబ్ అధ్యక్షురాలు డా.కావలి మౌని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు, చంద్రకళ, భవానిదుర్గలను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, క్లబ్ కార్యదర్శి రేపాక మణిదీప్తి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు



జుత్తిగ సోమేశ్వర ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: జుత్తిగ గ్రామంలో ఉన్న శ్రీఉమా వాసుకి రవిసోమేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు కలిసి దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. 8 నెలలకు గాను రూ.2.77 లక్షల ఆదాయం వచ్చినట్లు తణుకు దేవదాయ శాఖ తనిఖీ అధికారి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాయి ప్రసాద్, కె.జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి

మొగల్తూరు: పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించడానికే జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరు మండలం కొత్తోట ట గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యులు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగ చేసుకోవాలన్నారు. అనంతరం మెడికల్ క్యాంపులో అందుతున సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, ఎంపీటీసీ సభ్యుడు లింగం ఏసుబాబు, కవురు సీతామహాలక్ష్మి, కర్రి ఏసుబాబు, పడవల సత్యనారాయణ, రేవు నారాయణమూర్తి, పడవల శ్రీదర్, కొల్లాటి సుదాకర్, తన్నీడి గిరి, గుట్టుముక్కల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో...

నరసాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యులు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. మండలంలోని సరిపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపులో పరిష్కారం కాని రోగాలకు ఆరోగ్యశ్రీ వర్తించే కార్పొరేట్ ఆసుపత్రులకు పంపించి చికిత్స చేయిస్తారని, వాటికి అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు చేస్తున్న పౌష్టికాహార వంటకాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఉపయోగపడుతుందని వివరించారు. తొలుత రూ.20 లక్షల జీజీఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, జిల్లాపరిషత్ నిధులు రూ.3 లక్షలతో మరమ్మతులు చేసిన మహిళా సమైఖ్య భవనాన్ని ప్రసాదరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్‌యాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, సర్పంచ్ ఈదా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నంవెంకట్రావు, ఇంజేటి జాన్‌కెనడీ, మైలాబత్తుల రాజ్‌కుమార్, గమిడి మధుబాబు, దొంగ మురళీకృష్ణ, జిల్లా మత్స్యకారసంఘం అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు, మైలాబత్తుల శ్రీను, కృష్ణంరాజు, కేదాసు శోభనరావు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం రూరల్:సరిపల్లిలో రోగులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

యలమంచిలిలో..

యలమంచిలి: ప్రతి గ్రామంలోను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యాన్ని ప్రజల ముంగిటకే చేర్చిన ఘనత జగనన్న ప్రభుత్వానిదని ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి అన్నారు. కాజ తూర్పు గ్రామంలోని పింగళి వెంకయ్య ఓరియంటల్ హైస్కూల్‌లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్, డాక్టర్ శీలం సతీష్, డాక్టర్ చంద్రరేక, డాక్టర్ చందన ప్రియాంక, డాక్టర్ ప్రియాలు 361 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ పాతూరి బుచ్చిరాజు, సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జవదాల సువర్ణరాజు సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు జిల్లా కార్యదర్శి కొండేటి రవి పాల్గొన్నారు.

విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు చెప్పారు. మండలంలోని బల్లిపాడు గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను చేరువచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ శిబిరంలో డా. నవ్యజీవన్, డా.సుధీర్, డా. గంగాభవాని, డా.రాజీవ్, డా.లీనా సుప్రియలు 423 మంది రోగులను పరీక్షించారు. వీరిలో వివిధ సమస్యలో బాధపడుతున్న 13 మందిని గుర్తించి ఆరోగ్యశ్రీకి సిఫార్సు చేశారు. అలాగే 98 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమైని గుర్తించారు. అలాగే 80 మందికి కళ్ల జోళ్లు అందించడానికి చర్యలు తీసుకున్నారు. శిబిరంలో సర్పంచ్ భూపతిరాజు ఇందిరాదేవి, దెందులూరు పార్టీ పరిశీలకుడు యడ్ల తాతాజీ, కోఆప్షన్ సభ్యుడు తండా ఇస్సాక్‌రాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, పార్శి వెంకటరత్నం, గ్రామ పార్టీ నాయకులు కాగిత అశోక్, భావన చంద్రయ్య, బళ్ల వెంకట్రావు, కాగిత సాయిబాబు తదితరుల పాల్గొన్నారు.



పెనుగొండ: కోడేరులో వైద్యులకు సూచనలుచేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, రుడా చైర్మన్ షర్మిలారెడ్డి

పెనుమంట్రలో..

పెనుమంట్ర: రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేయడమే కాకుండా వారిలో మనోధైర్యాన్ని నింపడానికి డాక్టర్లు కృషి చేయాలని మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం మార్టేరు బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి ప్రారంభించారు. అనంతరం రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డితో కలిసి శిబిరాన్ని సందర్శించి శ్రీరంగనాథరాజు శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లును కలిసి రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టాకుమారి రాము, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కర్రి అనురాధ జోగిరెడ్డి, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

పేదల వైద్యానికి రక్ష

పెనుగొండ: రాష్ట్రంలో పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షణగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం నడిపూడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాన్ని పేదల ఇంటికి చేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ అనునిత్యం పేదల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, ఎంపీటీసీ కట్లమ్మ,సొసైటీ అధ్యక్షుడు కేశవరపుగణపతి, ఉప సర్పంచ్ పూరిళ్ల శ్రీను, పోడూరి రామయ్య,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోడేరులో

ఆచంట మండలం కోడేరులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రుడా చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డితో కలిసి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభించారు. వైద్య పరీక్షలు నిర్వహించి వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, దేవరపు సూర్యనారాయణ పాల్గొన్నారు.



మొగల్తూరు: కొత్తోటలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



యలమంచిలి: కాజ తూర్పు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి



పాలకొల్లు అర్బన్ బల్లిపాడులో రోగులకు కళ్ల జోళ్లు అందజేస్తున్న టీటీడీ పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు



పెనుమంట్ర: మార్టేరులో వైద్యశిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి రంగనాథరాజు

పాలకొల్లు-ద్వారకాతిరుమల పాదయాత్ర ప్రారంభం



ద్వారకాతిరుమలకు పాదయాత్ర చేస్తున్న భక్తులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని యడ్లబజారులో ఉన్న శ్రీపంచముఖాంజనేయస్వామి ఆలయ అర్చక స్వామి ఎస్‌టీపీవీ రమణ గురుస్వామి ఆధ్వర్యంలో 11వ సారి ద్వారకాతిరుమల పాదయాత్రకు గురువారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. వీరు 9వ తేదీకి ద్వారకాతిరుమల చేరుకుంటారు. శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని తిరిగి బస్సుల్లో బయలుదేరతారు. సుమారు 900 మంది భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. వీరందరికీ బస, భోజనం, మందులు, ఇతర ఏర్పాట్లను ఆలయం తరపున రమణ గురుస్వామి ఏర్పాటు చేశారు.

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు

పెనుగొండ: గ్రామాల్లోని అభివృద్ధికి నిధులు అందించి సమస్యలు పరిష్కరిస్తూ అండగా నిలుస్తున్నారంటూ పెనుగొండ, ఆచంట గ్రామాలకు చెందిన పలువురు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. గురువారం పెనుగొండలో రహదారి విస్తరణ చేసి, డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని, ఆచంటలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించారంటూ ఆయా ప్రాంతాల వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, కోట వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, ప్రముఖ ఇంజనీరు టీసీహెచ్‌వీ సత్యనారాయణ రెడ్డి, దొమ్మేటి సూర్రావు, తేతలి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్, కుడిపూడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సత్కరిస్తున్న పెనుగొండ వాసులు

పరామర్శ

పెనుగొండ ఏఎంసీ డైరక్టరు జుత్తిగ బాలయ కుటుంబాన్ని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు గురువారం పరామర్శించారు. బాలయ సతీ మణి భవాన్ని ఇటీవల మృతి చెందారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి(బాబీరెడ్డి), నడిపూడి సొసైటీ చైర్మన్ కేశవరపు గణపతి, ఉప సర్పంచ్ పూరిళ్ల శ్రీను, పెచ్చెట్టి జేమ్స్, డేవిడ్‌లు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్తిపాలెం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నరసాపురం సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కారణంగా ఆగర్తిపాలెం, ఆగర్రు, మైజారుగుంట, సగంచెరువు, గొల్లగూడెం, వెలివెల, తిల్లపూడి, తిల్లపూడిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వివరించారు.

అభివృద్ధి పనులకు తీర్మానాలు



పెనుగొండ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ పంచాయతీ పాలక వర్గ సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు ఆమోదించారు. గురువారం సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అధ్యక్షతన పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను ఆమోదించారు. పలు సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, గతంలో తీర్మానించిన అభివృద్ధి పనులూ పూర్తి చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఈఓపీఆర్డీ సి.సుదర్శన్ రెడ్డి, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనకు సహకరించాలి

పోడూరు: సామూహిక ఎలుకల నిర్మూలనలో రైతులంతా భాగస్వామ్యం కావాలని పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు పిలుపునిచ్చారు. పోడూరు గ్రామంలో గురువారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రైతులకు సర్పంచ్ సువర్ణరాజు ఆధ్వర్యంలో ఎలుకల మందు పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వరి పంటకు ప్రతీఏటా ఎలుకల వల్ల తీవ్ర పంట నష్టం వాటిల్లుతోందన్నారు. రైతులంతా కలిసి తమ పొలాల్లో ఒకేసారి మందు పెట్టడం వల్ల సామూహికంగా ఎలుకలను నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎలుకల మందు పెట్టేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్నపిల్లలకు, పశువులకు, పక్షులకు మందుపొట్లాలను దూరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చేకూరి సూరిబాబు, వీఏఏ సుమతి తదితరులు పాల్గొన్నారు.



పోడూరులో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు

దూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేత

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ంలోని అచ్చుగట్లపాలెం ప్రాంతానికి చెందిన అడ్డాల సత్యవతి గుంటూరులో ఓ అనాథాశ్రమంలో ఉంటున్నారు. ఈ వృద్ధురాలు అనారోగ్యంతో పింఛన్ తీసుకోవడానికి రాలేకపోవడంతో వలంటీర్ రేలంగి వెంకటలక్ష్మి బుధవారం గుంటూరు వెళ్లి ఆమెకు పింఛన్ అందజేసింది. ఇంత దూరం వచ్చి పింఛన్ అందించినందుకు ఆమె ఎంతో ఆనందించి వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది.

హైదరాబాద్ వెళ్లి అందజేత

యలమంచిలి: కాజ పడమర గ్రామానికి చెందిన బొంతు భవాని, గుబ్బల సరోజినిలు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిరువురికి పింఛన్ ఇవ్వడానికి కాజ పడమర సచివాలయంలో సోషల్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రావి కుమార్ గురువారం హైదరాబాద్ వెళ్లి ఇద్దరికీ పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌ను సర్పంచ్ గుబ్బల వేణుగోపాలస్వామి, సొసైటీ చైర్మన్ గుబ్బల రామకృష్ణ, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి అభినందించగా భవానీ, సరోజిని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



గుంటూరు వెళ్లి సత్యవతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మి

నరసాపురంలో అభివృద్ధి పనుల జోరు

- రూ.3.37 కోట్లు నిధులతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- ఇప్పటికే పూర్తయిన పలు పనులు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో పలు వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల పనులు జోరుగా సాగుతున్నాయి. 14వ ఆర్థికసంఘం నిధులతో చేపట్టిన రోడ్ల నిర్మాణాలు వేగంగా ముందుకు వెళుతున్నాయి. పలు ప్రధానమైన రహదారులు, డ్రెయిన్స్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. వర్షాలు తగ్గిన నేపథ్యంలో పెండింగ్ పనులు పూర్తి చేసే విషయంలో అధికారులు దృష్టి పెట్టారు. దీంతో కీలకమైన ప్రాంతాల్లో, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయిన్స్‌కు కొత్తరూపు వచ్చింది. ముఖ్యంగా ఇటీవల కాలంలో జనరల్ ఫండ్స్‌ను పెద్ద ఎత్తున ఖర్చు చేస్తూ అభివృద్ధి పనులు చేపట్టిన మున్సిపాలిటీ, తాజాగా 14వ ఆర్థిక సంఘం నిధులతో వేసవిలో పూర్తిగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తుంది. స్టేషన్ పేట, గ్రేస్‌నగర్, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, వైఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లు శిథిలం కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో కొన్ని చోట్ల డ్రెయిన్స్ కూడా శిథిలమయ్యాయి. దీంతో ప్రధానంగా 14వ ఆర్థిక సంఘం నిధులను ఈ ప్రాంతాల్లో వెచ్చించి రోడ్లు, డ్రెయిన్ల పనులు చేపట్టారు.



స్టేషన్‌పేట వద్ద రైల్వేస్టేషన్ సమీపంలో రూ 1.05 కోట్లుతో పూర్తయిన సీసీరోడ్డు, కెనాల్ సపోర్టింగ్‌వాల్

రూ.3.37 కోట్లతో పనులు

మొత్తం రూ.3.37 కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులతో మార్చి నెలలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఏడాదిన్నర క్రితం స్టేషన్‌పేట ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్ వెనుక చినమామిడిపల్లి మీదుగా రైల్వేగేట్ సమస్యకు పరిష్కారంగా బైపాస్ రోడ్డు నిర్మించారు. అయితే ఇప్పుడు ఈ బైపాస్‌రోడ్డుకు అనుసంధానంగా స్టేషన్‌పేటలో ఉన్న రోడ్డును 14వ ఆర్థికసంఘం నిధులతో పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా అభివృద్ధి చేశారు. రూ 1.05 కోట్లుతో సీసీరోడ్డు, కెనాల్‌పక్కన సపోర్టింగ్‌వాల్ నిర్మించారు. సుమారు 30 గ్రామాల ప్రజలు ఇటుగా ప్రయాణిస్తారు. వీరందరికీ ఈ రోడ్డు ఎంతో ఉపయోగంగా మారింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే స్టేషన్‌పేట నుంచి గ్రేస్ నగర్ వరకూ రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. . 22వ వార్డులో రూ.42 లక్షలతో సీసీరోడ్డు, ఎన్టీఆర్ కాలనీలో రూ.36 లక్షలతో సీసీ రోడ్డు, వైఎస్సార్ నగర్‌లో రూ.48 లక్షలతో సీసీరోడ్డు, 2వ వార్డులో రూ.28 లక్షలతో సీసీరోడ్డు, డ్రెయిన్, 10వ వార్డులో రూ.12 లక్షలతో డ్రెయిన్, 1వ వార్డు శ్రీహరిపేటలో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, కల్వర్టు పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఈ రహదారులు వినియోగంలోకి వస్తే ప్రజల రవాణా ఇబ్బందులు పూర్తిగా తీరనున్నాయి.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



పట్టణంలోని వార్డుల్లో చాలా కాలంగా రోడ్లు, డ్రెయిన్స్ శిథిలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ఇబ్బందులు గమనించి ఆర్థిక సంఘం నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని మున్సిపాలిటీకి ఆదేశాలు ఇచ్చాను. ఈ నేపథ్యంలో చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయి. పనులు నాణ్యతతో జరిగేలా నిత్యం పర్యవేక్షిస్తున్నాను.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్